# మునగ

దక్షిణ భారతదేశంలో పేరు పొందిన బహు వార్షిక కూరగాయల్లో మునగ ఒకటి. పెరటి తోటల్లో పెంచబడే ఈ పంట ప్రస్తుతం వాణిజ్య పరంగా పండించబడుతోంది. కాయలతో పాటుగా మునగ ఆకులు వైద్యపరంగా ఉపయోగించబడుతున్నాయి.

**వాతావరణం :** $20^0$ - $25^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత వున్న ప్రాంతాలు అనుకూలం. $40^0$ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో పూత రాలిపోతుంది. మంచునూ, అధిక చలిని తట్టుకోలేదు.

**నేలలు :** అన్ని రకాల నేలలు అనుకూలం. అధిక సేంద్రియ పదార్థాలతో కూడిన ఇసుక నేలలు శ్రేష్ఠం. నేల పి.హెచ్. 6.0-7.5 మధ్యన వుంటే మంచిది.

**విత్తే సమయం:** వార్షిక మునగ ఎప్పుడు నాటినా, వేసవి ప్రారంభంలోనే పూతకు వస్తుంది. కాబట్టి ఆగష్టు-సెప్టెంబరు నెలలో గింజలను పాలిథీన్ సంచుల్లో గానీ, నేరుగా పొలంలోగానీ విత్తుకోవాలి. బహువార్షిక రకాలలో కత్తిరింపులను జూన్ రెండవ వారం నుండి ఆగష్టు చివరి వరకు భూమిలో నాటుకోవచ్చు.

**రకాలు :** దేశవాళీ రకాలు ఎక్కువగా సాగులో వున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో జాఫ్నా, పి.కె.యం-1 రకాలు ఎక్కువగా సాగుబడిలో వున్నాయి.

**పి.కె.యం-1 :** వార్షిక రకం. మొక్క 4-6 మీ. ఎత్తు వరకు పెరిగి విత్తిన 160-170 రోజులలో పూతకు వస్తుంది. కాయ పొడవు 65-70 సెం.మీ. కాయబరువు - 150గ్రా. దిగుబడి : మొక్కకు 33 కిలోలు లేదా 200-225 కాయలు.

**జాఫ్నా :** బహువార్షిక రకం. కాయ పొడవు 60-90సెం.మీ., మెత్తని గుజ్జు, రుచికరంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుండి కాపుకు వస్తుంది. దిగుబడి : మొదటి రెండు సంవత్సరాలు సం॥నికి చెట్టుకు 80-90 కాయలను, నాల్గవ సంవత్సరం నుండి సం॥నికి చెట్టుకు 500-600 కాయలను పొందవచ్చు.

**నేల తయారి :** నేలను 4-5 సార్లు దుక్కి వచ్చే వరకు దున్నాలి. బహువార్షిక రకాలకు 5×5మీ. దూరం, ఏకవార్షిక రకాలయితే 2.5×2.5 మీ. దూరం వుండాలి. గుంటల పరిమాణం 45×45×45 సెం.మీ. వుండాలి. ప్రతి గుంటకు 10 కిలోల పశువుల ఎరువు మరియు 250గ్రా. వేపపిండి మరియు సూపర్‌ఫాస్ఫేట్ వేయాలి.

**వ్యాప్తి చేసే విధానం :** బహువార్షిక రకాలను 90-100సెం.మీ. పొడవు, 5-8సెం.మీ. మందం గల కొమ్మల కత్తిరింపుల ద్వారా వ్యాప్తి చేయవచ్చు. ఎకరానికి 160 కాండం ముక్కలు కావాలి. ఏక వార్షికాలను విత్తనాల ద్వారా వ్యాప్తి చెందించవచ్చు (250గ్రా. ఎకరాకు చొప్పున) గింజలను నేరుగా పొలంలో విత్తుకోవాలి లేదా పాలిథీన్ సంచుల్లో విత్తి 15-20సెం.మీ. ఎత్తు పెరిగిన తర్వాత పొలంలో నాటుకోవచ్చు.

**అంతరకృషి :** మొక్కలు 60-75 సెం.మీ. ఎత్తు పెరిగాక మొక్కలు చివర్లు త్రుంచి వేయాలి.

**ఎరువులు :** గింజలు విత్తిన 3 నెలలకు ఒక్కొక్క గుంటకు 100గ్రా. యూరియా, 50గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీటిని ఇవ్వాలి. మొక్కలకు ఆరు నెలలకు ఒకసారి, 9 నెలలకు మళ్ళీ ఒకసారి 100 గ్రా. యూరియా+50గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసి నీరు కట్టాలి.

**నీటి యాజమాన్యం :** విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటితడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటితడి ఇవ్వాలి. వరుసల మధ్య అంతర పంటలుగా అలసంద, బెండ, వంగ, ఫ్రెంచి చిక్కుడు వంటి పంటలను వేసుకోవచ్చు.

**సస్యరక్షణ :** చిన్న గొంగళి పురుగులు గుంపులు గుంపులుగా కాండంపై చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. పెద్ద పురుగులు ఆకులన్నీ తిని ఈనెలను మిగులుస్తాయి. నివారణకు లీటరు నీటికి ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. కలిపి పురుగులు చిన్నవిగా వున్న దశలో పిచికారి చేయాలి.

**కాయతొలుచు ఈగ :** కాయతొలుచు ఈగ పూత దశలో ఆశించి, పిందె దశలో కాయలోనికి ప్రవేశించి, లోపల పదార్థాన్ని తిని నాశనం చేయడం వల్ల కాయల ఆకారం మారిపోయి వంకరగా అవుతాయి. కాయ తొలుచు ఈగ నివారణకు పూత దశలో లీటరు నీటికి ఫాసలోన్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో లీటరు నీటికి డైక్లోరోవాస్‌ను 1మి.లీ. కలిపి మరల పిచికారి చేయాలి. అవసరమైతే మరోసారి 25 రోజులకు పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు, కాండం కుళ్ళు :** వర్షాకాలంలో మురుగునీరు పోయే సౌకర్యం లేని నేలల్లో ఎక్కువగా ఆశిస్తుంది. కాండం చుట్టూ వున్న బెరడు కుళ్ళిపోయి, చెట్టు విరిగి పోతుంది. వేర్లు కూడా కుళ్ళిపోయి చెట్టు చనిపోతుంది. నివారణకు మొక్కల మొదలు వద్ద 1గ్రా. కార్బండైజిమ్ లేదా 3గ్రా. డైథేన్ యం-45 ఒక లీటరు నీటికి కలిపిన ద్రావణం కాని లేదా 1 శాతం బోర్డోమిశ్రమంగాని ముంపుగా తడపాలి. మొక్క మొదలు వద్ద మురుగు నీరు నిలువకుండా జాగ్రత్త తీసుకోవాలి. ప్రతి చెట్టు మొదలులో ట్రైకోడెర్మా విరిడి (2 కిలోలు/ఎకరాకు) కలిపిన పశువుల ఎరువును 5 కిలోల చొప్పున వేయాలి.

**కోతకోయటం :** బహువార్షిక రకాలు నాటిన 8-9 నెలలకు కాపుకు వస్తాయి. మొదటి పంట మార్చి-జూన్ నెలలో, రెండవ పంట సెప్టెంబర్ – అక్టోబరు నెలల్లో వస్తుంది. పంట పెరిగినపుడు మొక్కకు ప్రతి సంవత్సరానికి 500-600 కాయల వరకు దిగుబడి వస్తుంది. ఏకవార్షిక మునగ రకాలు గింజలు విత్తిన 6 నెలలకే కాపుకొస్తాయి(ఫిబ్రవరిలో). రకాన్ని బట్టి ప్రతి మొక్కకు మొదటి సంవత్సరం 150-200 కాయలు, రెండవ సంవత్సరం250-400 కాయల దిగుబడి వస్తుంది. కాయలు కోసిన తర్వాత, ఒకు మీటరు ఎత్తులో కొమ్మలను కత్తిరించి కార్శి పంటను తీసుకోవచ్చు. ప్రతి కత్తిరింపుకు పైన చెప్పినట్లు ఎరువులను వాడాలి. బహువార్షిక రకాలని ఒకసారి చెట్టు ఆకారంలో కత్తిరింపు చేశాక తిరిగి 10-12 సంవత్సరాల వరకు ఎటువంటి కత్తిరింపు అవసరం లేదు. ఆ తర్వాత తోటలో కొత్త మొక్కలను నాటుకోవాలి.

మునగ సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా **251వ** పేజీలో ఇవ్వబడింది.